# శాపం

"ధర్డ్రైన్ 'బి' గాని వెళ్లిందా?"

"లేదు"

"కాంప్లెక్స్ మీదుగా వెళ్లే బస్సులేవైనా..."

ఇప్పుడిప్పుడే రెండు వెళ్లిపోయాయి." సిటీ స్టాప్‌లో ప్యాసింజర్లు అడిగిన ప్రశ్నలకు అంత ఓపికగా సమాధానాలిస్తున్న వ్యక్తి ఎవరనుకుంటున్నారు? ఎంక్వయిరీ క్లర్క్ అనుకుంటే మాత్రం పప్పులో కాలేసినట్లే, స్టాప్ స్టాప్‌కి విచారణ కేంద్రాన్ని ఏర్పాటుచేసే స్థితికింకా మన రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ చేరుకోలేదు. ఇంతకు అతడెవరో చెప్పనేలేదు కదూ! అతగాడు రెవెన్యూ కార్యాలయంలో చిరుద్యోగి. అందరిలా ఆఫీసు అయిపోగానే అతడు ఇంటికి పోడు.

తిన్నగా బస్‌స్టాప్‌లో కొచ్చి కూర్చుంటాడు. అడిగినవాళ్ళకు బస్సుల సమాచారాన్ని అందిస్తుంటాడు. పాపం అతడు ఏకాకే మో అనుకునేరు? అతడికి ఇల్లుంది. ఇల్లాలుంది. కన్నవాళ్లూ వున్నారు. మరెందుకతడు అంత నిర్లిప్తంగా ఊసుపోనివాడిలా రోడ్డుమీద సమయం గడుపుతున్నాడని అడిగితే మాత్రం ఠపీమని సమాధానమివ్వలేం. నిజానికి మొన్నటివరకు నాకూ తెలీదు.

రాత్రి పదవుతున్నది.

"అక్కయ్యపాలెం పోయే బస్సుందా?" అందరిలానే యధాలాపంగా అడిగిన నేను శ్రీనివాస్‌ని చూసి నివ్వెరపోయాను. వెంటనే తేరుకుని "నువ్వెప్పుడు చేపట్టావురా ఈ ఉద్యోగం?" అంటూ వెటకారమాడాను. మామధ్య అంతచనువుకు కారణం చిన్నప్పుడు ఇద్దరం కలిసి చదువుకొవటమే.

"నా సంగతికేంగాని నువ్వేంటి ఈవేళప్పుడు..." అన్నాడు వాడు.

"మా కొలిగ్ పెళ్ళికి వెళ్ళి వస్తున్నాను"

మాటల్లో వచ్చి ఆగిందో సిటీబస్సు.

"నువ్వెళ్లే రూట్లో ఇప్పుడు బస్సులేం లేవు. ఆటో అడిగితే అరవై ఇమ్మంటాడు. నా మాట విని ఈ రాత్రికి మా ఇంటికొచ్చేయ్. తెల్లవారగానే వెళ్లిపోదువుగాని"

ఏదో మాటవరసకు అన్నట్లుగా లేదామాట. అతడి పలుకుల్లో అభ్యర్ధన వుంది. ఆత్మీయత గోచరిస్తుంది.

ఇప్పటికిప్పుడు అర్జంటుగా ఇంటికెళ్లి నిర్వహించే రాచకార్యాలేవీ నాకు లేవు. అందుకే పదమన్నాను.

మేం శ్రీనివాస్ వుంటున్న కాలనీలో కాలు పెట్టేసరికి పదిన్నరైంది. పరిసరాలు చిమ్మ చీకటిగా వున్నాయి. ఆ సందులో ఒక్కవీధి దీపమైనా లేదు. ఎక్కడో ఓ వీధి కుక్క అదేపనిగా మొరుగుతోంది.

మెల్లగా ఓ ఇంటి గుమ్మం ఎక్కాడు శ్రీనివాస్. వీధి తలుపులు వారగా వేసున్నాయి. లోపలకెళ్లి లైటు వేసాడు. జిగేల్మంది వరండా.

నడవకు అటు ఇటు రెండు గదులున్నాయి. ఓ గదిలో అతడి తల్లిదండ్రులు గురకపెడుతున్నారు. మరోగదిలో అతడి శ్రీమతిలా వుంది పక్కమీద అటుఇటూ దొర్లుతోంది. భర్త వచ్చినట్లు అలికిడైనా లేవలేదు.

"బాత్రూం కెళ్లి కాస్త రిఫ్రెష్ అవు " స్నానాలగది చూపిస్తూ టవలు అందించాడు శ్రీనివాస్.

అతడినోకంట గమనిస్తూనే తువ్వాలు పుచ్చుకుని పెరట్లోకెళ్లాను. భార్యని లేపి అన్నం వడ్డించమన్నాడు శ్రీనివాస్.

"నావల్లగాదు" చిరాకుగా అటునుంచి ఇటుదొర్లుతూ అంది. "ఇవాళ మనింటికిగెస్ట్ వచ్చాడు. వాడెవడో కాదు. నా ఆప్తమిత్రుడు. ప్లీజ్" బ్రతిమాలుతున్నాడు శ్రీనివాస్. ఆ మాటలు వినిపించనట్లే నటించిందామె.

"సంతానం లేనంత మాత్రాన ఆలుమగలు సంతోషంగా వుండకూడదన్న నియమమేదైనావుందా మహేశ్వరీ. పిల్లలు లేనివాళ్లంతా ఇలాగే వుంటున్నారా చెప్పు" దీనంగా వేడుకుంటున్నాడు.

"అందరి సంగతి వేరు. నేను గొడ్రాలిని కావటానికి నువ్వే కారకుడవని నీకు తెలీదా? నన్నెందుకు రెచ్చగొడతావ్, వెళ్లు ఇక్కడినుంచి" కోడెత్రాచయింది మహేశ్వరి.

మరి మాట్లాడలేదు శ్రీనివాస్. నేను బాత్రూం నుంచి వచ్చేసరికి డైనింగ్ టేబుల్మీద ఆహారపదార్థాలు సిద్ధం చేస్తున్నాడు.

"మహేశ్వరి పడుకుంది. ఆమెను లేపడం ఎందుకని నేనే..." అంటూ నసిగాడు.

"సెల్ఫ్ సర్వీస్ ఈజ్ ఆల్వేస్ బెస్ట్" అన్నాను నవ్వుతూ. నా మూలంగా వాడుపడుతున్న ఇబ్బందిని గమనించిన తరువాత నేను రాకుండా వుంటేనే బావుండేదేమో అనిపించింది. వారి దాంపత్యంలో సఖ్యత లేదని తెలిసి నా మనసు అదోలా అయిపోయింది.

అన్నం తింటున్నంతసేపూ ఏవేవో మాట్లాడుతున్నాడు శ్రీనివాస్. ఊ... ఆ... అనడం నా వంతైంది.

పడుకోవడానికి వరండాలో మడతమంచాలు వాల్చి పక్కలు పరిచాడు. తల్లి మంచంమీంచి లేచిన అలికిడి అవడంతో నన్ను పడుకోమని చెప్పి అటుగా వెళ్లాడు.

అతడామెతో ఎంత మెల్లగా మాట్లాడుతున్నా నాకు వాళ్ల సంభాషణ స్పష్టంగా వినిపిస్తూనే వుంది.

"అనుకోకుండా ఇవాళ నా మిత్రుడొచ్చాడు. తెల్లవారగానే వెళ్లిపోతాడు. మహేశ్వరికి కాస్త నువ్వే చెప్పమ్మా లేవగానే కాఫీ కలిపిమ్మని"

ఆ ముక్కేదో నువ్వే చెప్పరాదూ"

"అది వినేరకం అయితేనా" "నువ్వుచేసిన నిర్వాకానికి మా మనసులే కుతకుత ఉడికిపోతున్నాయి. ఇక దాని సంగతి చెప్పాలా..."

జరిగిందేదో జరిగిపోయింది. పెద్దదిక్కుగా మీరు దానికి నచ్చచెప్పడంపోయి గతం తవ్వుకుంటూ కూర్చుంటే ఏంలాభం? సంసారాన్ని మరింత నరకం చేసుకోవడానికి తప్ప"

"పసిపాపలు పారాడవలసిన ఈ ముంగిటిని నువ్వే చేజేతులా శ్మశానవాటికగా మార్చేసావన్న నిజాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతోంది. మమ్మల్ని ఏం చేయమంటావ్?"

వాళ్ల మాటలు, ఆ ఇంటి వాతావరణం చూస్తుంటే నాకంతా అయోమయంగా వుంది. మిస్టరీలా గోచరిస్తోంది. అసలేం జరిగిందో తెలీడంలేదు.

నా మనసు శ్రీనివాస్‌పట్ల జాలి, సానుభూతితో నిండిపోయింది. ఇంట్లో మనశ్శాంతి లేకనే అతడు రోజంతా బయట గడుపుతున్నాడని నాకిప్పుడు అర్థమైపోయింది. నేను మెలకువగా ఉండటం చూసి "ఇంకా నిద్రపోలేదా?" అంటూ దగ్గరకొచ్చాడు.

"కాసేపు అలా బయట కూర్చుందాం వస్తావా?" అన్నాను. నా మాటకు ఏమనుకున్నాడో ఏమో 'పద' అన్నాడు. ఇద్దరం బయట అరుగుమీద కూర్చున్నాం.

ఆకాశంలో చుక్కలు మిణుకు మిణుకు మంటున్నాయి. నా మనసు బితుకు,

బితుకుమంటోంది. పది నిమిషాలపాటు మామధ్య మాటల్లేవు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నాం. అనంతరం నేనే వాడిని కదిలించాను. "మీకు పిల్లలు కలగకపోవడానికి నువ్వెంతవరకు బాధ్యుడవు?" అని అడిగాను. ఆ మాటకు వాడు పసివాడిలా కంట తడి పెట్టాడు.

శ్రీనివాస్‌ని చూస్తే నా హృదయం ద్రవించుకుపోయింది. జరిగిందేమిటో వివరంగా చెప్పమన్నాను. ఆప్తులతో కష్టాన్ని పంచుకుంటె గుండె తేలికవుతుందన్నాను.

నోరు విప్పాడు శ్రీనివాస్

శ్రోతనయ్యాన్నేను.



"నా భార్య గర్భవతి అని తెలియడంతో ఇంట్లో పండగసందడి సంతరించుకుంది. మాకో నలుసు కలిగితే ఆ బిడ్డతో ఆడుకోవాలని అమ్మా నాన్న ఎంతగానో సంబర పడ్డారు. తండ్రిని కాబోతున్నందుకు నాకు గర్వంగానే ఉంది. ఇక మహేశ్వరి సంగతి వేరే చెప్పాలా? మాతృత్వంలోని మాధుర్యాన్ని చవిచూసేందుకు తెగ ఆరాటపడిపోతోంది. అలా అంతా ఎంతో సంతోషంగా ఉన్న తరుణంలోనే నేను వాళ్ళకు విషాదాన్ని మిగిల్చాను వాళ్ళ ఆనందాన్ని హరించేసాను" అంటూ బేలగా నా వంక చూసాడు.

"ఏంచేసావ్" అన్నాను గభాలున ఉత్కంఠను అణచుకోలేక.

"పుట్టబోయే బిడ్డ ఆడోమగో తెలుసుకుందామని మా ఆవిడకు స్కానింగ్ చేయించాను. ఆమె కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువని తెలిసి సహించలేకపోయాను. మొదటి నుండి ప్రథమ సంతానం కొడుకైతే బావుండునని అనుకునేవాడిని. ఎందుకంటే మగపిల్లవాడైతే వంశాన్ని ఉద్ధరిస్తాడని, చచ్చినప్పుడు కొరివి పెడతాడని. అయితే మహేశ్వరి ఆలోచనావిధానం అందుకు భిన్నంగా వుండేది. ఆడపిల్లలకే తల్లిదండ్రుల

పట్ల ప్రేమాభిమానాలు ఎక్కువగా ఉంటాయని, కాటికెళ్లేటప్పుడు కన్నీరు పెట్టేది కూతురేనని, ఇహ కన్నవాళ్ల విషయానికొస్తే అడ్డైతేనేం? మగైతేనేం? అంతా మగపిల్లలే కావాలనుకుంటే వాళ్లకి పెళ్ళాలెలా వస్తారనేవారు.

ఎవరేం చెప్పినా వినకుండా మహేశ్వరిని నాకు బాగా సన్నిహితుడైన డాక్టరు వద్దకు తీసుకెళ్లి అతడిని ఒప్పించి ఆమె వద్దు మొర్రో అంటున్నా వినకుండా ఆమెకు అబార్షను చేయించాను. గర్భస్థ శిశువు శాపమో లేక నా పాపమో తెలీదు. ఆ తర్వాత మరి నా భార్యకు సంతానమే కలగలేదు. పిల్లలకోసం నేను పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు.

మహేశ్వరికి ఎన్నెన్నో వైద్య పరీక్షలు చేయించాను. రకరకాల మందులు ఇప్పించాను. శస్త్ర చికిత్స అవసరమంటే అందుకు కూడా వెనకాడలేదు. వీటన్నిటికి డబ్బు మంచినీళ్లలా ఖర్చుచేసాను. ఆమె సంతానానికి అన్ని విధాలా యోగ్యురాలే మరెందుకు గర్భం దాల్చడంలేదో తెలియడంలేదన్నారు వైద్యులు. చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో చివరికి ఆ దైవంమీద భారం వేసాను.

పూజలు, వ్రతాలు చేసాం. గుడులు గోపురాలు దర్శించాం. ఆడోమగో ఏదో ఒక బిడ్డను ప్రసాదించమని వేడుకున్నాను. ఏం చేసినా ఫలితం లేకపోవడంతో మా ఆవిడకు పిచ్చెక్కినట్లయింది. ఆ క్షణంనుంచి భర్త అన్న గౌరవం లేకుండా నన్ను చులకనగా చూడసాగింది.

కన్నవాళ్లు కూడా పరిస్థితి అర్థం చేసుకోకుండా నన్నే అసహ్యించు కుంటున్నారు. నేను చేసింది తప్పే. కాదనను అయితే ఒకసారి ఎబార్షను చేయించినంత మాత్రాన పిల్లలే పుట్టరని ఎలా అనుకుంటాం? ఇలా ఎక్కడైనా జరిగిందా? భ్రూణ హత్య చేసిన నేరానికి నేను శిక్ష అనుభవిస్తున్నా నంటున్నారు. ఆపిల్ల శాపమే నాకు మరి పిల్లలు కలగకపోవడానికి కారణమన్నారు.

నాకు మూఢ విశ్వాసాల మీద నమ్మకం లేకపోయినా వాళ్ల మాటలు వింటుంటే అవి నిజమేమో అనిపిస్తోంది. నేనే కాదు నాలాంటివాళ్లు ఎందరో నేడు లింగనిర్ధారణకు స్కానింగ్ చేయిస్తున్నారు. చట్టరీత్యా అది నేరమని తెలిసి కూడా ఆడశిశువుల్ని ఈ భూమ్మీద పడకుండా అడ్డుకుంటున్నారు. నాకథ అటువంటి వాళ్లకు కనువిప్పు కావాలి" అంటూ మిస్టరీ ఛేదించాడు శ్రీనివాస్.

(11.మే,2002 ఆంధ్రభూమి డైలీ)